క్లుప్తంగా

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

భాష్యం రామకృష్ణ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆటలో గెలుపోటము లతో సంబంధం లేకుండా విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. రింగ్‌రోడ్డులోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఇంటర్ హౌస్ స్పోర్ట్స్‌మీట్‌లో రెండో రోజైన మంగళవారం క్రీడాపోటీలను భాష్యం రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు పఠనాసక్తి, అభ్యసన సామర్థ్యం పెరుగుతాయన్నారు. క్రీడాపోటీల నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల మనో వికాసానికి, శారీరక దృఢత్వానికి భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ముందుగా స్పోర్ట్స్‌మీట్ పతాకాన్ని ఆవిష్కరించిన రామకృష్ణ క్రీడాజ్యోతిని వెలిగించి, విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



నెహ్రూనగర్: నగరంలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడుకి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సమితి సభ్యులు మేయర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న దివ్యాంగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, ఆ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాలలో వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్న దివ్యాంగులు విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కొన్ని సచివాలయాలు అపార్ట్‌మెంట్స్‌లో ఉండటం వలన మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తగిన చొరవ తీసుకోవాలన్నారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ నగరంలో వార్డు సచివాలయాల వారీగా మొదటి, రెండవ అంతస్తులలో ఉన్న సచివాలయాలను పరిశీలించి దివ్యాంగ ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేయర్‌ను కలిసిన వారిలో సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు ధూపాటి రమణయ్య ఉన్నారు.

సుమేధ హైస్కూల్లో బాలోత్సవ్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో మంగళవారం బాలోత్సవ్-6 వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న 29వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ బాలల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. నేషనల్ గ్రీన్‌కార్ప్స్ సమన్వయకర్త డి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నెలరోజుల ముందు నుంచి ముందస్తు బాలల దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించే బాలోత్సవంలో భాగంగా లిటరరీ, కల్చరల్, స్పోర్ట్స్, గేమ్స్ విభాగాల్లో 32 ఈవెంట్స్ వారీగా పోటీలను నిర్వహించి, 2,500 బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ముందుగా బాలోత్సవ్ ప్రారంభానికి సంకేతంగా బెలూన్లు ఎగురవేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సురక్ష క్యాంపుల్లో అధునాతన వైద్యసేవలు

- నగర కమిషనర్ కీర్తి చేకూరి
- శారదాకాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సందర్శన



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేసిన కమిషనర్ కీర్తి, నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్లు

నెహ్రూనగర్: జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అధునాతనమైన వైద్య సేవలు అందుతున్నాయని, నగర ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకుంటున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని శారదాకాలనీ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీలా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా, స్థానిక కార్పొరేటర్ ధూపాటి వంశీ, అధికారులతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని, ఏఎన్ఎం, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అనారోగ్య బాధితులను గుర్తించి క్యాంప్ గురించి అవగాహన కలిగించారన్నారు. ఇప్పటికే గత వారం రోజుల నుంచి నగరంలో జరుగుతున్న సురక్ష క్యాంప్‌ల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, తగిన వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. క్యాంప్‌ల్లో ఖరీదైన కంటి పరీక్షలు, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు పూర్తి ఉచితంగా చేసి మందులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్యం సంపూర్ణంగా అందాలనే ఉన్నత లక్ష్యంతో జగనన్న సురక్ష అమలు చేస్తుందని, నగరంలోని 29 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్యాంప్‌ల్లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటుగా ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకొని, అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్‌ల్లో చేర్చి చికిత్స అందిస్తారని, ఆరోగ్య శ్రీ ద్వారా కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు.

- డిప్యూటీ మేయర్ వజ్రబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సుదీర్ఘ పాదయాత్రలో పేదల ఇబ్బందులు స్వయంగా గమనించి, అధికారంలోకి రాగానే నవరత్నాల ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రాతిపదికగా వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష అనారోగ్యం ఉన్న ప్రతి ఒక్కరికీ వరం వంటిదన్నారు. డిప్యూటీ మేయర్ సజీల మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన తెచ్చినవిధంగా, ప్రజల వద్దకు వైద్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చారన్నారు. పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ ఉందని, నగరంలో 29 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని, జగనన్న సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప వరం లాంటిదన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు, మందులు కూడా ఇస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే..



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా, పక్కన నూరిఫాతిమా

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపలోనూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చారు కాబట్టే.. ప్రతి ఇంటికి ధైర్యంగా వెళ్లగలుతున్నామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' అనే అంశంపై వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్క కార్యకర్త సన్నద్ధంగా ఉండాలన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి, ప్రతి పేదవారికి అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంతోషంగా ఉన్నామని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు చెబుతున్నారని, తద్వారా మరింత వారికి ప్రభుత్వ చేస్తున్న మంచిని వివరించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. విద్యా, వైద్యం, మహిళలు, కార్మిక, రైతు వర్గాలతో పాటు అన్ని వర్గాలకు మేలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. దానిలో భాగంగాలనే జగనన్న ఆరోగ్య సురక్ష, విలేజ్ డాక్టర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి తీసుకుని రావటం వంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి గడపలోనూ... ప్రతి ఇంటిలోనూ మంచి చేశాను అని మీకు అనిపిస్తేనే ఓటు వేయండి అనే సత్తా ఉన్న ఏకైక నేత సీఎం జగన్ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నేతలు, అంజుమన్ సంస్థల అధ్యక్షుడు అబ్దుల్‌కర్నుమా తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గుంటూరు మెడికల్: మానసిక ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జీజీహెచ్ మానసిక వైద్య విభాగంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేటి ప్రజలు ప్రాశ్చాత్య జీవన శైలికి అలవాటు పడ్డారని, కంప్యూటర్ యుగంలో కాలంతో పరుగులు తీస్తున్నారని తద్వారా మానసిక ఆరోగ్యం ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోందన్నారు. మానసిక ఆరోగ్యం కోసం ఒత్తిడికి దూరంగా ఉండి, ప్రశాంత వాతావరణాన్ని కల్పించుకోవాలన్నారు. మందులు, ఇంజక్షన్లు వల్ల కొంత ఉపశమనం కలిగినా మానసిక స్థైర్యం కోల్పోకుండా ఉంటే తప్పనిసరిగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ల వార్డులో రోగులతో కాసేపు మాట్లాడి పండ్లు పంపిణీ చేశారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మానసిక విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ నీమీష, డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ మాధురి ప్రియ, డాక్టర్ ఫర్హాత్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం



అన్నదానం చేస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: అన్నదానం పుణ్యకార్యంతో సమానమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం సినీ నటుడు, రాష్ట్రప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ పుట్టిన రోజు సందర్భంగా పట్టాభిపురంలోని అనురాగ్ ఓల్డ్ ఏజ్ హోంలో అలీ ఫోర్స్ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అలీ చిన్న వయస్సునుంచే సినీ రంగంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అంచలంచలుగా ఎదిగారన్నారు. బాలనటుడు, కమెడియన్, హీరో వంటి ఏ పాత్రలోనైనా ఇమిడిపోయే నటనాకౌసల్యంతో తెలుగువారి అభిమానటుడిగా అలీ నిలిచారన్నారు. అలీకి రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారులుగా నియమించడంతో ఆ రంగంలోని సమస్యల పరిష్కారంతో పాటు ఆ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎల్‌వీ ఆంజనేయులు, సాదు రాజేష్, గేదెల రమేష్, బోగిసం ప్రసాద్, కంతేటి శ్యాం శేఖర్, అలీ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఐదుగురు డీలర్ల నుంచి రూ.70 వేలు జరిమానా వసూలు



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐలు శ్రీనివాసులరెడ్డి, శ్రీహరిరావు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పలు సెల్‌ఫోన్ల దుకాణాలలో విజిలెన్స్, తూనికలు - కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో మంగళవారం కొత్తపేట, బ్రాడీపేట, అరండల్‌పేటలో పది దుకాణాలల్లో తనిఖీలు కొనసాగాయి. డిక్లరేషన్స్ ఎంఆర్‌పీ, వినియోగదారుల వివరాల్లేకుండా పరికరాలు కొనుగోలు చేసి విక్రయించే వారిపై పది కేసులు నమోదు చేశారు. ఐదుగురు డీలర్ల నుంచి రూ.70 వేలు జరిమానా వసూలు చేశారు. మిగతా దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, తూనికలు - కొలతల శాఖ అధికారి సునీల్‌రాజు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహనా ర్యాలీ

ఏఎన్‌యూ: యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సెలింగ్ సెంటర్, ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన మనసు - మన హక్కులు' అనే నినాదంతో ఉన్న పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ బ్రహ్మజీరావు, డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య విద్యార్థులతో కలిసి యూనివర్సిటీలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ డి.సరోజ, డాక్టర్ యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక రోగులు తారసపడితే సమాచారమివ్వాలి

తెనాలిరూరల్: రోడ్లపై, ఇతర ప్రాంతాల్లో ఎవరి సంరక్షణలో లేని మానసిక రోగులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలని మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. న్యాయవాది ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ తనను తాను సంరక్షించుకోలేని స్థితిలో విచ్చలవిడిగా తిరుగుతున్న మానసిక రోగిని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ అదుపులోకి తీసుకుకి 24 గంటల్లో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాల్సి ఉంటుందని చెప్పారు. రోగి పరిస్థితిని పరిశీలించిన న్యాయమూర్తి మానసిక వైద్యశాలకు పంపే అవకాశముంటుందన్నారు.

హోండా యాక్టివా స్పెషల్ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల



కొనుగోలుదారునికి వాహన కీ అందిస్తున్న మంజునాథ్ పాటిల్

పాత గుంటూరు: టూ వీలర్ వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్ కంపెనీ అత్యంత పాపులర్ మోడల్ హోండా యాక్టివా బీఎస్ 6 వెర్షన్-2 లోని స్పెషల్ ఎడిషన్ మార్కెట్ లోకి విడుదల చేసింది. స్థానిక హోండా ఆథరైజ్డ్ డీలర్ సంతోష్ హోండా షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో హోండా మోటా ర్ సైకిల్, స్కూటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ మంజునాథ్ పాటిల్ స్పెషల్ ఎడిషన్ ప్రథమ వాహనాన్ని వినియోగదారులకు అందజేశారు. షోరూమ్ అధినేత చుక్కపల్లి జగన్ మోహన్‌రావు మాట్లాడుతు షోరూమ్ ప్రారంభించి 20 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని హోండా వాహన కొనుగులుదారులకు గతంలో ఎన్నడూలేని విధంగా ఆకర్షణీయమైన ఉచిత బహుమతులు ప్రతి వాహనంతో పాటు అందజేయనున్నట్లు తెలిపారు. షోరూమ్ జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ హోండా యాక్టివా స్పెషల్ ఎడిషన్ అందమైన బాడీగ్రాఫిక్స్‌తో అలాయ్ వీల్స్‌తో బాడీకలర్ గ్రాబ్రెయిల్‌తో రెండు రంగులు నలుపు, బ్లూలతో తక్షణ డెలివరీకి సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో హోండా సర్వీస్ ఇంచార్జ్ హర్షవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు .

అంధుల పాలిట పెన్నిధి పబ్బరాజు

ఇద్దరికి పబ్బరాజు వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి పురస్కారాలు ప్రదానం



మాట్లాడుతున్న కె.ఎస్.లక్ష్మణరావు

నగరంపాలెం: అంధుల పాలిట పెన్నిధి పబ్బరాజు వెంకటేశ్వరరావు అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని బాలాజీ మండపంలో పబ్బరాజు వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి పురస్కార - 2023 ప్రదానోత్సవ సభ జరిగింది. అధ్యక్షత వహించిన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విద్యతోనే అంధులు, దివ్యాంగులు అభివృద్ధి సాధించవచ్చని పబ్బరాజు వెంకటేశ్వరరావు భావించారని అన్నారు. దీనిలో భాగంగా 1995లో శ్రీ షిర్డీ సాయి దీన జన సేవా సమితిని స్థాపించారని పేర్కొన్నారు. వేలాది మంది అంధుల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. అనంతరం పబ్బరాజు వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి స్మారక మానవ సేవా పురస్కారాలను పాన్ ఇండియా ఆర్గనైజేషన్ అధినేత అంధులైన డాక్టర్ ఎస్.గోవిందరాజ్ (మహారాష్ట్ర), మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ప్రిన్సిపాల్ అంధులైన డాక్టర్ గంటా జనార్ధన్‌నాయుడు (విజయనగరం)లకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పబ్బరాజు వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఎ.పూర్ణచంద్రరావు, మేనేజింగ్ ట్రస్టీ పి.సత్యనారాయణమూర్తి, ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్యులు ఎన్.రంగయ్య, అమరావతి జేఏసీ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు, వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ చిట్టిపోతు మస్తానయ్య, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి, ఎస్.తిరుపతయ్య, మోదుగుల పాపిరెడ్డి, యు.మధుసూధనరావులు మాట్లాడారు.

రెవెన్యూ బకాయిలు చెల్లించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలోని మార్కెట్‌లు, సైకిల్ స్టాండ్లు, టాయ్‌లెట్స్ టెండర్ పొంది నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన రెవెన్యూ బకాయిలు ఈ నెల 13వ తేదీనాటికి పూర్తిగా చెల్లించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్‌తో కలిసి డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో రెవెన్యూ విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు సంబంధించిన మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు, టాయ్‌లెట్స్‌లను టెండర్ దక్కించుకొన్న కాంట్రాక్టర్లు నిర్దేశిత రుసుం నగరపాలక సంస్థకు చెల్లించలేదని, అటువంటి వారు ఈ నెల 13వ తేదీ నాటికి చెల్లించకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో బకాయి వసూళ్లు, యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. రోజువారీ వసూళ్లపై నివేదిక ఇవ్వాలన్నారు. అండర్ అసెస్మెంట్లు, కొత్త అసెస్మెంట్లపై ఆర్ఐల వారీగా నివేదిక ఇవ్వాలని, మొదటి అర్ధ సంవత్సరం ముగిసినందున ఆస్తి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. పన్ను వసూళ్లకు వార్డు సచివాలయం వారీగా బకాయిదార్ల, మొండి బకాయిదార్ల లిస్టులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. నగరంలో వాటర్ మీటర్ల చార్జీల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని అసహనం వ్యక్తం చేసి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు బాలాజీ బాషా, సాంబశివరావు, రెహమాన్, సూపరింటెండెంట్లు వెంకట రామయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ములాయం కృషి



ములాయం సింగ్ యాదవ్ వర్ధంతి సభలో డొక్కా మాణిక్య వరప్రసాద్, శ్రీవల్లి, కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తపించిన ములాయం సింగ్ యాదవ్ ఆశయాల బాటలో బీసీలందరు ముందుకు నడవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీనగర్‌లోని మండల్ స్టడీ సర్కిల్‌లో ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా స్టడీ సర్కిల్ డైరెక్టర్ తోట కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జనగణనలో కులగణన, మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ ఉప కోటా కల్పించడమే ములాయం సింగ్ యాదవ్‌కు మనమిచ్చే నివాళి అని అన్నారు. బీసీలంతా ఐకమత్యంగా ఆయన ఆశయాలను సాధించడంతో పాటు ఆలోచనలను కొనసాగించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షుడు తోట కోటేశ్వరరావు మాట్లాడుతూ జనాభా లెక్కలు సేకరించి, సమస్త జీవన రంగాల్లో బీసీలకు రావాల్సిన న్యాయమైన వాటాను కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్ శ్రీవల్లి, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, పిన్నిబోయిన శ్రీనివాసరావు, తాడికొండ నరసింహారావు, ఓర్సురాజు, భగత్‌సింగ్, నీలాంబరం, కేవీ సుబ్రహ్మణ్యం, ఉగ్గం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గుడిలో బంగారు ఆభరణాలు మాయంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: గుడిలో బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణనగర్ 1వలైనులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సెప్టెంబరు 26వ తేదీ అర్చకుడు బి.శ్రీరాములు ఆలయం తలుపులు వేసి తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి 27వ తేదీ తాళాలు తెరిచి, తలుపు తెరవగా పద్మావతి అమ్మవారి బంగారంతో చేసిన కళ్లు, ముక్కుపుడక కనిపించలేదు. మంగళవారం శ్రీరాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం

డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా





మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ బాషాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: విద్యార్థులు, యువతను ఒత్తిడి మానసిక రుగ్మతల నుంచి వ్యాయామం, ధ్యానం దూరం చేస్తాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో మంగళవారం విద్యార్థులలో మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని దూరం చేయడంపై అవగాహన కలిగించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనిషి యాంత్రిక జీవనాన్ని గడుపుతున్నాడని నిత్యం యంత్రంలా పని చేయడం వలన ఒత్తిడికి గురవుతున్నారని, విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. శారీరక ఆరోగ్యం బాగుండాలి అంటే మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. సామాజిక మాధ్యమాల వలన మానసిక అనారోగ్యాన్ని ఎదుర్కొంటున్నారని, చదువు రోజు వారి పనులలో వెనుక బడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై మల్లిఖార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐఎల్‌జే భక్తాసింగ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.